క్లుప్తంగా

ఘనంగా కరుమారియమ్మ జాతర



పూజల్లో పాల్గొన్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని కొండమిట్ట ప్రాంతంలో వెలసిన కరుమారియమ్మ ఆలయంలో మంగళవారం జాతర ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మురళి ఆధ్వర్యంలో జరిగిన జాతరలో భాగంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి సారెను అందజేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేశారు. పవిత్రారెడ్డి మాట్లాడుతూ పురాతన కాలం నుంచి కరుమారియమ్మ కరుణతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.

ముస్తాబైన పరశురామేశ్వర స్వామి ఆలయం



ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయం ఆడికృత్తిక సందర్భంగా మంగళవారం ముస్తాబైంది. ఆలయ ఆవరణలోని సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం చైర్మన్ నరసింహయాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆడికృత్తిక ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలు, తాగునీరు, ప్రసాదాలను ఏర్పాటు చేశారు.

ఎన్నికల నామినేషన్ ప్రారంభం



ఎంపీడీఓ కార్యాలయంలో నామినేషన్‌ల కోసం ఏర్పాటు చేసిన గది

ఏర్పేడు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ పంచాయతీలకు చెందిన సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ మంగళవారం ప్రారంభమైనట్లు రిటర్నింగ్ అధికారి సురేంద్రనాథ్ తెలిపారు. వివిధ కారణాలతో గతంలో మండలంలోని పెనుమల్లంలో సర్పంచ్, జంగాలపల్లిలో 7వ వార్డు, కందాడులో 6వ వార్డు, మడిబాకలో 3వ వార్డు, పంగూరులో 10వ వార్డుకు ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మళ్లీ ఈ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 8 నుంచి 10 వరకు నామినేషన్‌లు, 11న స్క్రూట్నీ, 14న విత్‌డ్రావెల్, ఫైనల్ లిస్ట్ ప్రకటన, 16న పోలింగ్, ఓట్ల లెక్కింపు ఉంటుందని రిటర్నింగ్ అధికారి తెలిపారు. మంగళవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలుకాలేదని చెప్పారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



ప్లేట్లు పంపిణీ చేస్తున్న ఉజ్వల్‌రెడ్డి

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లంకు చెందిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఓడూరు ఉజ్వల్ రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకుని వితయ్యపాళెం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన విద్యార్థులకు భోజన ప్లేట్లు, గ్లాసులు వితరణగా మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, స్థానిక యువత పాల్గొన్నారు.

అశ్వవాహనంపై కృష్ణ భగవానుడు



అశ్వవాహనంపై శ్రీకృష్ణుడు

నారాయణవనం: స్థానిక ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం కృష్ణ భగవానుడు అశ్వవాహనం అధిరోహించి పురవీధుల్లో విహరించారు. డప్పు వాయిద్యాలు, కోలాటాల మధ్య కొనసాగిన ఊరేగింపులో మహిళలు హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అశ్వవాహనంపై శ్రీకృష్ణుడు, ఆలయం నుంచి ద్రౌపతీ, పాండవులు వేర్వేరుగా సప్రవాహనాలపై నగరు వీధికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నగరు వీధిలో దౌపతీ స్వయంవరాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులు ఆలయానికి చేరుకున్నారు. రాత్రి పాండవులతో ద్రౌపదీదేవి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా పూర్తిచేసి, భక్తులకు అక్షింతలు అందజేశారు.

మార్మోగిన హరోహర

- రామగిరిలో వేడుకగా ఆడికృత్తిక తెప్పోత్సవాలు ప్రారంభం
- భరణి, అష్టమి ఒకేరోజు రావడంతో భారీగా విచ్చేసిన భక్తులు
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు
- తెప్పోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిమూలం, పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమారరాజా



ప్రత్యేక అలంకరణలో వళ్లీదేవసేన సమేత ముత్తుకుమార స్వామికి హారతి ఇస్తున్న అర్చకులు

పిచ్చాటూరు: ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని పిచ్చాటూరు మండలం రామగిరి శ్రీ సుబ్రమణ్య స్వామి ఆలయ ప్రాంగణం హరోహర నామస్మరణతో మార్మోగింది. శ్రీ వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో భరణి తెప్పోత్సవాలు మంగళవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. స్వామివారి మూలవర్లకు అర్చకులు భరణి అభిషేకం చేసి వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి చేరుకుని పుష్కరిణిలో కావళ్లు చెల్లించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు దాతలు అన్నదానం చేశారు. సాయంత్రం శ్రీవళ్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామి ఉత్సవర్లకు ప్రత్యేక అభిషేకం చేసి, పుష్పాలతో అందంగా అలంకరించి తిరుచ్చిపై అధిష్టించారు. స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి ఊరేగింపుగా పుష్కరిణి వద్దకు తీసుకెళ్లి తెప్పోత్సవం నిర్వహించారు. ఈ తెప్పోత్సవాన్ని తిలకించిన భక్తజనం రాత్రంతా ఆలయ ప్రాంగణంలో జాగారం చేశారు. భక్తుల కాలక్షేపం కోసం భక్త మార్కండేయ హరికథ కార్యక్రమం ఏర్పాటు చేశారు. భరణి అభిషేక ఉభయదారులుగా శ్రీ పళ్లికొండేశ్వరాలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు వ్యవహరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ లత, పాలకమండలి చైర్మన్ వెంకటేశ్వర్లు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తెప్పోత్సవాల్లో ఎమ్మెల్యే, పాలఏకరి చైర్మన్

వళ్లీదేవసేన సమేత తెప్పోత్సవాల్లో స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార రాజా పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు వారు ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం వళ్లీ దేవసేన సమేత ముత్తుకుమార స్వామి ఉత్సవర్లను దర్శించుకున్నారు. అలాగే స్వామివారి భరణి తెప్పోత్సవాల్లో పాల్గొన్నారు.

ఉదయం అష్టమి పూజలు..

రామగిరిలో అష్టమిని పురస్కరించుకుని ఉదయం శ్రీ కాలభైరవ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. మహిళలు నేతిదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీవాలీశ్వరాలయ క్షేత్రపాలకుడిగా కొలువై ఉన్న సంతాన కాలభైరవ స్వామి మూలమూర్తిని దర్శించుకుని తరించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు. భరణి, అష్టమి ఒకే రోజు రావడంతో భక్తులు భారీగా వచ్చారు.

భారీ బందోబస్తు ..

ఆలయానికి వేలాది భక్తులు రావడంతో పోలీసు ఉన్నతాధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తెప్పోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు, పుత్తూరు రూరల్, సత్యవేడు సీఐలు సురేష్ కుమార్, శివకుమార్ రెడ్డితో పాటు ఆరుగురు ఎస్ఐలు, 120 మంది మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నట్లు స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



కావళ్లతో పోటెత్తిన భక్తజనం



పిచ్చాటూరు: ముత్తుకుమార స్వామి భరణి వద్ద ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



శ్రీసిటీలో నిర్వహించిన శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

- శ్రీసిటీ15వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు
- 425 మందికి పైగా పరిశ్రమల ఉద్యోగుల రక్తదానం

సత్యవేడు: శ్రీసిటీ 15 వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రెండు వేర్వేరు ప్రదేశాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. శ్రీసిటీ ఫౌండేషన్, నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా శ్రీసిటీ ట్రేడ్ సెంటర్, బిజినెస్ సెంటర్లలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. శ్రీసిటీలోని వివిధ పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు, వలంటీర్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ రక్తదానంలో భాగస్వాములు కావడానికి ముందుకొచ్చిన ప్రతి ఒక్కరికీ ఆయన అభినందనలు తెలిపారు. రక్తదాతల డేటాబేస్‌ను శ్రీసిటీ ఫౌండేషన్ అందుబాటులో ఉంచుతుందన్నారు. ఎక్సెలెంట్ ఫార్మా, బ్రేక్స్ ఇండియా, డెనిలీ, ఇసుజు, పాయోలాక్స్, ట్రాయ్సి, ఏషియన్, టోరే, ఎంఎఎండి పరిశ్రమ ఉద్యోగులు రక్త దానం శిబిరంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ సీహెచ్ రమేష్ , ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పీఆర్వో ఎం.మధుసూధనరావు, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్(కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్, సెక్యూరిటీ చీఫ్ వై.రమేష్, హెచ్‌ఆర్ ప్రతినిధి వి.శివకుమార్‌రెడ్డి, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్లు సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

నేటినుంచి నా భూమి-నా దేశం గ్రామసభలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు

వరదయ్యపాళెం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో మొక్కలు నాటి స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తిని ప్రజలకు తెలియజేసేందుకు కేంద్ర ప్రభుత్వం నా భూమి–నా దేశం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆ మేరకు బుధవారం నుంచి ఈ నెల 14 వరకు మండలంలో గ్రామసభలు జరగనున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు చెప్పారు. మంగళవారం వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన వివరాలను తెలిపారు. ఈనెల 9న కువ్వాకొల్లి, సంతవేలూరు, అంబూరు, మావిళ్లపాడు, మరదవాడ, 10న కళత్తూరు, సీఎల్ఎస్‌పల్లి, ముస్లింపాళెం, అయ్యవారిపాళెం, కురింజల్లం, 11న కారిపాకం, పులివల్లం, చిలమత్తూరు, మత్తేరిమిట్ట, తొండూరు, 12న బత్తలవల్లం, గూడలవారిపాళెం, కడూరు, కంచరపాళెం, అరుదూరు, 13న యానాదివెట్టు, రాచర్ల, చిన్న పాండూరు, తొండంబట్టు, పాండూరు, 14న కాంబాకం, ఇందిరానగర్, వరదయ్యపాళెం గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు జరగనున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి పోరాడుదాం



ముదిరాజ్ సంఘ నాయకుల సంఘీభావం

రేణిగుంట: ముదిరాజ్‌ల సంక్షేమం కోసం అందరం సమష్టిగా పోరాడాలని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వల్లమ కన్నయ్య అన్నారు. ముదిరాజ్‌ల ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని మామండూరు, గుండాలకాల్వలో నిర్వహించారు. ముదిరాజ్ ప్రజల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 20వేలకు పైచిలుకు జనాభా కలిగిన ముదిరాజ్ సామాజికవర్గానికి రాజకీయంగా, సామాజికంగా తగిన ప్రాధాన్యత లేదన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు వెంకటరమణయ్య, తోటకూర కోటేశ్వరరావు, గోవిందస్వామి, వెంకటేశ్వర్లు, గురుమూర్తి, అయ్యప్ప, సతీష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో యోగా గురువులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని జయరామరావువీధిలో గల శ్రీ శివసాయి యోగా సెంటర్ విద్యార్థులు తమ యోగా ప్రతిభను చాటుకున్నారు. ఈ నెల 6వ తేదీన తమిళనాడు గుమ్మిడిపూండిలో కైరాళి యోగా పీఠం వారు నిర్వహించిన 17వ యోగా ప్రదర్శనలో పాల్గొన్న శ్రీకాళహస్తి విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించారు. శివప్రియ సోంపల్లి(మొదటి), శోహిత(రెండవ), డింపుల్ శివాని(రెండవ), శ్రీనిధి వరదన్(మూడవ), శ్రీసూర్య(మూడవ), శ్రీచంద్ర(మూడవ), నవనీత్(మూడవ)స్థానాలను గెలుచుకున్నారు. యోగా సెంటర్ గురువు అయిలం సుజాత వంశీధర్‌కు కైరాళి యోగా పీఠం వారు యోగా రాణి బిరుదును ప్రదానం చేసి గౌరవించారు.

ప్రశాంత వాతావరణంలో ఉప ఎన్నికలు



ఉప ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న భవ్య కిషోర్

ఏర్పేడు: మండలంలోని పలు పంచాయతీల్లో నిర్వహించనున్న సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రేణిగుంట డీఎస్పీ భవ్య కిషోర్ అన్నారు. మండలంలో జరిగే ఉప ఎన్నికలపై మంగళవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పెనుమల్లం, జంగాలపల్లి, పంగూరు, కందాడు, మడిబాక పంచాయతీల్లో ఈ నెల 16న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. అన్ని పార్టీలకు చెందిన నాయకులు సహకరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏర్పేడు సీఐ శ్రీహరి పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

సత్యవేడు: మండల కేంద్రంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనున్నట్లు మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో దళవాయి అగ్రహారంలో పర్యటించనున్నట్లు చెప్పారు.

జాతర చాటింపు

నారాయణవనం: నారాయణవనంతోపాటు మరో మూడు గ్రామాల్లో ఏడు గంగమ్మల జాతరకు మంగళవారం రాత్రి చాటింపు వేశారు. నారాయణవనంలో మూడు ప్రాంతాల్లో వీకే పాళ్యం, నాగిలేరు, బొప్పరాజుపాళ్యం గ్రామాల్లో 16వ తేదీ బుధవారం జాతరను నిర్వహించనున్నారు.

నేడు శిక్షణ కేంద్రం ప్రారంభం

సత్యవేడు: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభిస్తారని ప్రిన్సిపల్ జి.ఉషాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్, సర్వీస్ టెక్నీషియన్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తారని చెప్పారు.

భూమనకు అభినందన



కరుణాకరరెడ్డిని సన్మానిస్తున్న మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: టీటీడీ బోర్డు చైర్మన్‌గా నియమితులైన భూమన కరుణాకరరెడ్డిని మంగళవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అభినందించారు. తిరుపతిలోని ఆయన స్వగృహానికి వెళ్లి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

విత్తనాల పంపిణీ

ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు తిరుపతి జిల్లాకు చెందిన 1,925 కిట్ల విత్తనాలను మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అందజేశారు. దీని విలువ రూ.9,500 అయితే, పూర్తి సబ్సిడీతో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పీఎం స్వనిధిపై అవగాహన

శ్రీకాళహస్తి: మున్సిపాలిటీలో వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకంపై అధికారులు అవగాహన కల్పించారు. కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ ఎలాంటి హామీ లేకుండా రుణం కోసం మెప్మా కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లిస్తే తిరిగి మళ్లీ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ లీడ్‌బ్యాంకు మేనేజరు, ఇండియన్ బ్యాంకు మేనేజరు, కార్పొరేషన్ బ్యాంకు మేనేజరు ఆధ్వర్యంలో బ్యాంకు అధికారులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలవ్యాప్తంగా రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. రైతులు ఆధార్, పొలంపాసుబుక్, బ్యాంకు పాసుబుక్ జిరాక్స్, ఫోన్ నంబర్లను అగ్రికల్చర్ అసిస్టెంట్లకు అందజేసి, వివరాలను ఈక్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. తద్వారా రాయితీలు రైతులకు అందుతాయని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుదుకుప్పంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సత్యవేడు: మండలంలోని పుదుకుప్పంలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో సిమెంటు రోడ్డు పనులను మంగళవారం మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ శరవణన్ ప్రారంభించారు. సుమారు రూ.2 లక్షలు, మండల గ్రాంట్ రూ.2.5 లక్షలతో కలిసి గ్రామంలో 104 మీటర్ల మేర సిమెంటు రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు వారు తెలిపారు.

మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎన్జీవో నాయకులు, ఉద్యోగులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): విజయవాడలోని ఇందిరా మైదానంలో ఈనెల 21, 22 తేదీల్లో జరిగే ఏపీ ఎన్జీవో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ శ్రీకాళహస్తి తాలూకా ఏపీ ఎన్జీవో అధ్యక్షులు, ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సి.చెంచురత్నం యాదవ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను మంగళవారం తొట్టంబేడు ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉద్యోగులు, ఎన్జీవో నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలకు ఉద్యోగులు ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, తప్పకుండా హాజరై విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర మహాసభలకు హాజరయ్యే వారు ముందుగా తమ పేర్లను ఏపీ ఎన్జీవో సంఘ అధ్యక్షునికి సమాచారమిస్తే, విజయవాడకు ప్రత్యేక బస్సుల్లో తీసుకు వెళ్తామని తెలిపారు. ఈనెల 20న సాయంత్రం శ్రీకాళహస్తి పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న స్కిట్ కళాశాల నుంచి సాయంత్రం 5గంటలకు బస్సులు బయలుదేరుతాయని పేర్కొన్నారు. ఈ సభలకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక కర్షక పెన్షనర్లు తప్పక హాజరై సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర సభలకు హాజరయ్యే వారు ఆదివారం సాయంత్రం 5 గంటలకు స్కిట్ కళాశాల వద్దకు చేరుకోవాలని ఇక్కడి నుంచి విజయవాడకు బస్సులను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర ఎన్జీవో నాయకుల పిలుపుమేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా మహాసభలకు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, కార్యవర్గ సభ్యులు బాలు, జనార్దన్, ఈశ్వర బాబు, రవికాంత్, బాల, తరుణాక్షిరెడ్డి, అంకయ్య, మునిరత్నం, ప్రసాద్, కుమారస్వామి, మునెయ్య, పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలతో అధిక ఆదాయం



రైతులకు చెక్కులను అందజేస్తున్న బాలాజీరెడ్డి

ఏర్పేడు: శాస్త్రీయ విధానంలో వాణిజ్య పంటలు సాగు చేసి రైతులు తమ ఆదాయాన్ని పెంపొందించుకోవాలని రాస్ మహిళా భారతి ప్రాజెక్ట్ అధికారి బాలాజీరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పాపానాయుడుపేట రాస్ కార్యాలయంలో రైతు సంఘాలకు రుణాల చెక్కుల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా లాభసాటి వ్యవసాయంలో రాస్ శాస్త్రవేత్తలు సలహాలు ఇస్తున్నారన్నారు. కుటుంబానికి రెండో ఆదాయ మార్గాలైన టైలరింగ్, ఎంబ్రాయిడరీ, ఆర్యావర్క్, బ్యూటీ పార్లర్, టీవీ, గ్రైండర్ రిపేర్, బుట్టల అల్లికలో శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో రాస్ క్షేత్రాధికారి వెంకట్‌కుమార్, ఎంఐఎస్ మునిపార్థసారథి, కో–ఆర్డినేటర్ మునీంద్ర పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణ ప్రారంభం



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రమణ్యంరాజు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి 7వ వార్డు, వీఎస్‌పురం 3వ వార్డు, జీఎస్‌కండ్రిగ 6వ వార్డు, నెరిణికండ్రిగ 6వ వార్డు, కాటూరు 6వ వార్డు మెంబర్లు చనిపోవడంతో ఖాళీ అయిన ఈ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు ఎన్నికల అధికారి బాబు తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉప ఎన్నికల నామినేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరణ, 11వ తేదీన పరిశీలన, 12న అభ్యంతరాలు, 13న ఆర్‌డీఓ పరిశీలన, 14న నామినేషన్లు ఉపసంహరణ, 14న 3 గంటలకు అభ్యర్థుల ప్రకటన, 19న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు, 3 గంటలకు కౌంటింగ్, గెలిచిన అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహులు, ఏఓ త్రివిక్రమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: మండలంలోని నారాయణవనం, డీకే పాళ్యం పంచాయతీలలో ఒకొక్క వార్డుకు తొలిరోజు మంగళవారం నామినేషన్లు దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారు ప్రభాకర్‌రాజు తెలిపారు. నారాయణవనం 4వ వార్డు సభ్యుడు నారాయస్వామి, డీకే పాళ్యం 4వ వార్డు సభ్యుడు భాస్కర్‌లు అనారోగ్యంతో మృతి చెందారు. ఖాళీలైన వార్డు సభ్యుల స్థానాలకు మంగళవారం నుండి నామినేషన్లు ప్రారంభమైయాయి. ఈనెల 19వ తేదీన ఎన్నికలను నిర్వహించనున్నారు.

తొలిరోజు నామినేషన్‌లు నిల్

పిచ్చాటూరు: సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు తొలిరోజు నామినేషన్లు ఏమీ దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి ఏవీ సుబ్బారావు తెలిపారు. అడవికొడియంబేడు సర్పంచ్ స్థానానికి, అడవిశంకరాపురం 1వ వార్డు, గోవర్ధనగిరి 7వ వార్డు మెంబర్ స్థానానికి సంబంధించి మంగళవారం నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైనట్లు చెప్పారు.

రెండు వార్డులకు ఉపఎన్నిక..

వరదయ్యపాళెం: మండలంలోని రెండు వార్డులకు ఉప ఎన్నిక జరగనున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తెలిపారు. రాచర్ల పంచాయతీలో 2వ వార్డు, ఇందిరానగర్ గ్రామ పంచాయతీలో 7వ వార్డుకు ఉపఎన్నిక జరుగుతుందని చెప్పారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా విద్యాకుమారిని ప్రభుత్వం నియమించింది.